
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



నేడు మీ కోసం కార్యక్రమం రద్దు

పాడేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏలో ప్రతి శుక్రవారం నిర్వహించే మీ కోసం కార్యక్రమాన్ని ఈనెల 9వ తేదీన రద్దు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేశామని పేర్కొన్నారు. ఈ మార్పును గమనించి ప్రజలెవరూ వినతులను ఇవ్వడానికి ఐటీడీఏ కార్యాలయానికి రావద్దని ఆయన కోరారు.

ఏజెన్సీలో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్

- బినామీ టీచర్లతో పాఠశాలలు నడిపిస్తే ఎంఈవోలపై చర్యలు
- నెట్‌వర్క్ ఉన్నచోట ఫేషియల్ అటెండెన్స్ టీచర్లు వేయాలి
- రూ.2.5 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు


మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం గిరిజన విద్యపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతూరు, రంపచోడవరం అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. బడిఈడు పిల్లలకు ఆధార్ నమోదు చేసి పాఠశాలల్లో చేర్పించాలని, ఆధార్ నంబర్ లేదని కథలు చెపితే ఉపేక్షించనని హెచ్చరించారు. అలాగే ఎంఈవోలు విధిగా పాఠశాలలు తనిఖీ చేసి విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు రాకుండా బినామీ వ్యక్తులతో నడిపిస్తే ఎంఈవోలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలైనా ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలాల వారీగా ఎంతమంది విద్యార్థులున్నారని ఎంఈవోలను అడిగి తెలుసుకున్నారు. అలాగే టీచర్లు పాఠశాలలకు వస్తున్నారా? విద్యార్థుల కోసం ఉపాధ్యాయులా? ఉపాధ్యాయుల కోసం విద్యార్థులా? అంటూ కలెక్టర్ ఎంఈవోలను ప్రశ్నించారు. అలాగే ఉపాధ్యాయులు తమకు దగ్గరలో ఎక్కడ నెట్‌వర్క్ అందుబాటులో ఉంటే అక్కడకు వెళ్లి ఫేషియల్ అటెండెన్స్ వేసి పాఠశాలకు హాజరు కావాలన్నారు. అలాగే ఈనెల 17వ తేదీన పాఠశాల విద్యా కమిటీలు ఎన్నికలు నిర్వహించి, వెంటనే కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించాలన్నారు. అలాగే 18 తేదీ నుంచి పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల పనులు చేయాలన్నారు. ఏజెన్సీలోని విద్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2.5 కోట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

విధిగా పాఠ్య ప్రణాళికలు రూపొందించాలి

ఉపాధ్యాయులు విధిగా పాఠ్య ప్రణాళికలు తయారు చేసి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచించారు. కొన్నిచోట్ల విద్యార్థులకు కనీసం చదవడం, రాయడం రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవోలు మండల కేంద్రాల్లో కూర్చుంటే కుదరదని, క్షేత్ర స్థాయి పర్యటనలు చేసిన విద్యా ప్రమాణాలు పర్యవేక్షించాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కా అమలు చేసి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ విద్యార్థులకు అందించాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు బేస్ లైన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులను ఏబీసీడీ గ్రేడులుగా విభజించి, సీడీ గ్రేడుల్లోని విద్యార్థులను బి గ్రేడుకు తీసుకురావాలన్నారు. అలాగే ఉపాధ్యాయులకు సబ్జెక్టులు, మెథడాలజీల్లో శిక్షణ అందిస్తామన్నారు. అలాగే టీచర్స్ యూనియన్ల లీడర్లతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో దోమల మందు పిచికారీ పనులు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు, ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉపసంచాలకుడు ఐ.కొండలరావు, ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధి ఎండమావేనా?

కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోని గిరి పల్లెలు

- సంపూర్ణంగా అందని సంక్షేమ, అభివృద్ధి ఫలాలు
- దయనీయంగా కొనసాగుతున్న గిరిజనుల జీవనం
- విద్య, వైద్యం, రోడ్లు, రవాణా అంతంతమాత్రమే..

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

పాలకులెందరు మారినా అడవుల్లో జీవించే ఆదివాసీల బతుకులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి చందంగానే ఉంటున్నాయి. ఆధునిక యుగంలోనూ గిరిజనులు కాలినడకన, గుర్రాలపై ప్రయాణాలు సాగించడం, రోడ్డు, రవాణా సదుపాయాలు లేక వైద్యం కోసం డోలీల్లో ఆస్పత్రులకు తరలించాల్సిన పరిస్థితులే ఉన్నాయి. ఈ క్రమంలో ఎందరో అడవి బిడ్డలు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు జరిగాయి. ఆగస్టు 9వ తేదీ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.


రోడ్డు, రవాణా సదుపాయం లేక రోగిని డోలీలో మోసుకెళుతున్న గిరిజనులు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో 22 మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో తొమ్మిదిన్నర లక్షల మంది గిరిజనులు జీవిస్తున్నారు. వారిలో ఏడు లక్షల మంది గిరిజనులు పాడేరు ఏజెన్సీలో ఉండగా.. మిగిలిన రెండున్నర లక్షల మంది రంపచోడవరం ఏజెన్సీలో ఉన్నారు.

కాలినడకలు.. డోలీ మోతలు..

ఈ రోజుల్లోనూ ఆదివాసీలు ఇతర ప్రాంతాలకు కాలినడకన రాకపోకలు సాగించడం, రోగులను డోలీల్లో మోయడం వంటివి గిరిజన ప్రాంతంలో రవాణా వ్యవస్థ దుస్థితిని తేటతెల్లం చేస్తున్నది. ఇప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో సగానికిపైగా గిరిజన పల్లెలకు కనీస రోడ్డు సౌకర్యం లేని పరిస్థితి. ఏజెన్సీలో మారుమూల పల్లెలు అధికంగా ఉన్న ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల్లో వందలాది గ్రామాలకు చెందిన ఆదివాసీలు నేటికి గుర్రాలతోనే తమ రాకపోకలు సాగిస్తున్నారు. ఏజెన్సీలో మండల కేంద్రాలు, కాస్తా రోడ్డు పక్కన గ్రామాలకు మాత్రమే రోడ్డు, రవాణా సదుపాయాలున్నాయి. అనేక పల్లెలు నేటికీ కొండకోనల్లోనే ఉన్నాయి.


ఏజెన్సీలో భవనం లేని ఇలాంటి బడులెన్నో

నేడు తలారిసింగిలో వేడుక

పాడేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయిలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో నిరాడంబరంగా వేడుకలను నిర్వహించాలని అధికారులు సూచించారు. దీంతో కలెక్టర్ ముఖ్యఅతిథిగా అధికార యంత్రాంగంతోనే ఈ వేడుకను నిర్వహించనున్నారు.

ప్రాథమిక వైద్యానికి నోచుకోని దుస్థితి

పాడేరు ఏజెన్సీలో ఉన్న ఏడు లక్షల మంది గిరిజనులకు వైద్య సేవలు అందించేందుకు ఏజెన్సీ వ్యాప్తంగా 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాడేరులో 200 పడకల జిల్లా ఆస్పత్రి, అరకులోయలో వంద పడకల ఏరియా ఆస్పత్రి, చింతపల్లిలో 50, ముంచంగిపుట్టులో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాలు, గిరిజన పల్లెలో 202 ఆరోగ్య ఉపకేంద్రాలు, గ్రామానికి ఒకరు చొప్పున 3,800 మంది ఆశ కార్యకర్తలున్నారు. కానీ నేటికీ గిరిజనులకు సాధారణ జ్వరం వచ్చినా సకాలంలో ప్రాథమిక వైద్యం అందని దుస్థితి కొనసాగుతోంది. ఏజెన్సీలోని ఆస్పత్రులను పర్యవేక్షించే అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి పోస్టు ఏడాదిన్నరగా ఖాళీగానే ఉంది. క్షేత్ర స్థాయిలో వైద్యసేవలు అందించే ఆశ కార్యకర్తల వ్యవస్థను పటిష్ఠం చేయకపోవడం, పారా మెడికల్ సిబ్బందిపై పర్యవేక్షణ లేమి కారణంగా గిరిజనులకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదు.

పల్లెల్లో కానరాని మౌలిక సదుపాయాలు

ఆదివాసీలు జీవించే పల్లెల్లో కనీస మౌలిక సదుపాయాలు లేని దుస్థితి నెలకొంది. రోడ్డు, రవాణా, తాగునీరు, విద్య, విద్యుత్ వంటి సదుపాయాలు సంపూర్ణంగా లేని పరిస్థితులు ... మిగతా 8వ పేజీలో

వీడిన మిస్టరీ

గంజాయి కోసం వచ్చి హత్యకు గురైన విశాఖ యువకుడు

- బీరు బాటిళ్లతో పొడిచి చంపి... లోగిలిగెడ్డలో పడేశారు
- డుంబ్రిగుడ, అరకు ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది అరెస్టు
- నిందితుల్లో ముగ్గురు మైనర్లు
- అరకులోయ సీఐ రుద్రశేఖర్


హత్యకు గురైన చంద్రకాంత్ (ఫైల్‌ఫొటో)

అరకులోయ, ఆగస్టు 8:

గంజాయి కోసం విశాఖపట్నం నుంచి అరకులోయ వచ్చిన యువకుల్లో ఒకరు హత్యకు గురైనట్టు సీఐ రుద్రశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో డుంబ్రిగుడ ఎస్ఐ సంతోష్‌కుమార్‌తో కలిసి హత్యకు సంబంధించిన వివరాలను విలేకరులకు సీఐ రుద్రశేఖర్ వెల్లడించారు.

విశాఖ నగరంలోని కంచరపాలేనికి చెందిన నలుగురు యువకులు జూలై 30వ తేదీన గంజాయి కోసం డుంబ్రిగుడ మండలం అరకు గ్రామానికి వచ్చారు.


విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ రుద్రశేఖర్, ప్రక్కన డుంబ్రిగుడ ఎస్ఐ సంతోష్‌కుమార్

అక్కడ కనిపించిన దాని అనే యువకుడిని గంజాయి కావాలంటూ అడిగారు. అలాగే రాజ్‌కుమార్ అనే యువకుడు తెలుసా...అని అడగడంతో తెలుసునంటూ అతను బొందుగుడ గ్రామ సమీపంలో గల బోరు షెడ్ వద్దకు వారిని తీసుకువెళ్లాడు. అక్కడకొచ్చిన మరికొందరు యువకులు గంజాయి కోసం డబ్బులు ఇవ్వాల్సిందిగా నగరం నుంచి వెళ్లిన వారిని అడిగారు. తమ వద్ద డబ్బులు లేవని, సెల్‌ఫోన్లు తీసుకొని గంజాయి ఇవ్వాలని అడిగారు. వారి వద్ద సెల్‌ఫోన్లు ఎనిమిది మంది యువకులు తీసుకున్నారు. అనంతరం అక్కడే ఉండాల్సిందిగా చెప్పి...గంజాయి తెస్తామంటూ వెళ్లారు. రాత్రి 7 గంటలకు తిరిగి వచ్చి గంజాయి లేదని చెప్పారు. దాంతో తమ సెల్‌ఫోన్లు ఇస్తే వెళ్లిపోతామని కంచరపాలెం నుంచి వచ్చిన నలుగురు యువకులు కోరారు. వాటిని ఇవ్వబోమంటూ ఎనిమిది మంది యువకులు కొట్లాటకు దిగారు. కంచరపాలెం నుంచి వచ్చిన నలుగురిలో ముగ్గురు దెబ్బలు తట్టుకోలేక పారిపోగా...చంద్రకాంత్ (19) స్థానిక యువకుల చేతికి చిక్కాడు. అతడిని దారుణంగా కొట్టి, బీరు బాటిళ్లతో పొడిచి చంపేశారు. చంద్రకాంత్‌కు చిన్న చిన్న దుంగలు కట్టి పక్కనే ప్రవహిస్తున్న లోగిలి గెడ్డలో పడేశారు. అంతేకాకుండా ... మిగతా 8వ పేజీలో

రేషన్ పాట్లు

మత్స్య గెడ్డ పొంగితే కష్టాలే..

- 20 రోజుల వరకు రాకపోకలు బంద్
- నిత్యావసర సరకులకు ఆరు గ్రామాల గిరిజనుల అవస్థలు
- వంతెన పూర్తికాక ఏటా ఇదే పరిస్థితి


రేషన్ సరకులు తల పెట్టుకొని జామిగూడ గెడ్డ దాటుతున్న గిరిజనులు

పెదబయలు, ఆగస్టు 8: మండలంలోని జామిగూడ పంచాయతీ కేంద్రంలో మత్స్యగడ్డపై వంతెన నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం అసంపూర్తిగా నిలిపివేయడంతో గెడ్డ అవతల ఆరు గ్రామాల గిరిజనులు అష్టకష్టాలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు నిత్యావసర సరకుల కోసం ఆదివాసీలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. వర్షాలకు మత్స్య గెడ్డ ఉధృతంగా పొంగితే 15 నుంచి 20 రోజుల వరకు బాహ్య ప్రపంచంతో వారికి సంబంధాలు ఉండవు. ఈ సమయంలో గెడ్డ అవతల ఉన్న గుంజీవాడ, తారాబు, చింతలవీధి, జడిగూడా, సరిగిగూడ, గబ్బర్ల గ్రామాల గిరిజనులు నిత్యావసర సరకులకు తీవ్ర ఇక్కట్లు పడుతుంటారు. అయితే ఆ సమయంలో గిరిజనులు తాము పండించుకున్న రాగులు, జొన్నలు, ఆకుకూరలతో కాలం వెల్లదీస్తారు. అనారోగ్యం బారిన సమయంలో ప్రాణాలకు తెగించి గెడ్డ దాటుతుంటారు. కొన్ని పర్యాయాలు గెడ్డ దాటుతూ ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటనలు లేకపోలేదు. గత వారం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఆయా గ్రామాల గిరిజనులు నిత్యావసర సరకులకు నోచుకోలేదు. ప్రస్తుతం వర్షాలు తగ్గి గడ్డ ఉధృతి తగ్గడంతో రేషన్ సరకులు జామిగూడలో ఇస్తుండడంతో ఆ గ్రామాల గిరిజనులు నడుము లోతు వరకు ఉన్న గెడ్డలో దిగి సరుకులను తలపై వాటిని పెట్టుకొని ప్రాణాలకు తెగించి గెడ్డ దాటుతున్నారు.

వంతెన నిర్మాణానికి బ్రేక్

2022 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో వంతెన నిర్మాణానికి గత వైసీపీ పాలకులు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మాణాన్ని గాలికి వదిలేయడంతో తాము ఈ పాట్లు పడవలసి వస్తుందని ఆ ప్రాంత వాసులు ఆవేదన చెందుతున్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలో దిగి నిరసన వ్యక్తం చేసి, వంతెన కోసం ... మిగతా 8వ పేజీలో

17న జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

పాడేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 17న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖాధికారులు సూచించారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల నిర్వహణపై సందిగ్ధం ఏర్పడింది. దీంతో జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, డీఈవో బ్రహ్మాజీరావు రాష్ట్ర ఎన్నికల కమిషన్, రాష్ట్ర విద్యాశాఖాధికారులకు ఈఎన్నికల నిర్వహణపై స్పష్టత ఇవ్వమని కోరుతూ లేఖలు రాశారు. దానిపై స్పందించిన రాష్ట్ర విద్యాశాఖాధికారులు జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు 17న నిర్వహించాలని, ప్రక్రియను మాత్రం ఈనెల 8 నుంచి ప్రారంభించాలని సూచించింది. దీంతో 8న ఓటర్లను గుర్తించడం, 12న ఓటరు జాబితా పరిశీలన, అభ్యంతరాలు స్వీకరణ, 17న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 2,014 విద్యాలయాల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

2,700 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

- వ్యాన్ సీజ్.. రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

కొయ్యూరు, ఆగస్టు 8:

రేషన్ బియ్యాన్ని అక్రమంగా నల్లబజారుకు తరలిస్తుండగా పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడి చేసి, గురువారం రాత్రి 2,700 కిలోల బియ్యాన్ని స్వాధీనపరుచుకున్నారు. కొయ్యూరు ఎస్ఐ రాజారావు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. రాజవొమ్మంగి నుంచి కృష్ణాదేవిపేటకు వ్యాన్‌లో బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కాకరపాడు కూడలి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వ్యాన్‌ని తనిఖీ చేయగా రేషన్ బియ్యం పట్టుబడ్డాయన్నారు. ఈ సందర్భంగా మూలపేట పంచాయతీ కొండసంతకు చెందిన ప్రకాష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్టు ఎస్ఐ రాజారావు చెప్పారు.

అనాథ బాలికను దత్తత చేసుకున్న ఎంఈవో

విద్యార్థినికి దుస్తులు, పుస్తకాలు అందజేత

- సర్వీసులో ఉన్నంతవరకు సాయం చేస్తానని ప్రకటన


అనాథ బాలికకు దుస్తులు అందజేస్తున్న ఎంఈవో ప్రసాద్

చింతపల్లి, ఆగస్టు 8: మండలంలోని వామగెడ్డ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ఓ అనాథ విద్యార్థిని మండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్ దత్తత తీసుకున్నారు. ఆ పాఠశాలను వారం రోజుల క్రితం ఎంఈవో సందర్శించారు. మూడో తరగతి విద్యార్థుల విద్యా ప్రగతి పరిశీలనలో భాగంగా వంతల శైలజ అనే విద్యార్థిని తెలుగు, ఆంగ్లం, గణితంలోనూ ఎంఈవో అడిగిన ప్రశ్నలకు చురుగ్గా సమాధానం చెప్పింది. దీంతో సంతృప్తి చెందిన ఎంఈవో విద్యార్థిని వ్యక్తిగత వివరాలను ఉపాధ్యాయుడు కుడుముల వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని శైలజకు తల్లి, తండ్రి ఇద్దరు లేరని, నాలుగేళ్ల క్రితం మరణించారని ఉపాధ్యాయుడు తెలిపారు. దీంతో చలించిపోయిన ఎంఈవో విద్యార్థినికి బాసటగా నిలవాలని నిర్ణయించుకున్నారు. గురువారం మరోసారి వామగెడ్డ పాఠశాలను సందర్శించిన ఎంఈవో వ్యక్తిగత నిధులతో విద్యార్థిని శైలజకు దుస్తులు, పుస్తకాలు అందజేశారు. తాను సర్వీసులో ఉన్నంతకాలం విద్యార్థినికి అవసరమైన వ్యక్తిగత అవసరాలు తీర్చడంతో పాటు విద్యాభ్యాసానికి అవసరమైన ఖర్చులు తానే సమకూర్చుతానన్నారు. విద్యార్థి శైలజను తాను దత్తత తీసుకుంటున్నారని ఎంఈవో ప్రసాద్ ప్రకటించారు. దీంతో విద్యార్థిని శైలజ, ఉపాధ్యాయులు ఎంఈవోకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి, కొయ్యూరు ఎంఈవోలు రామన్న, ఎల్.రాంబాబు, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి, ప్రధానోపాధ్యాయులు తిలక్ పాల్గొన్నారు.

క్రైం... crime news

తమ్ముడిపై హత్యాయత్నం

» ఇల్లు ఖాళీ చేయాలంటూ చాకుతో దాడి
» పెదగుమ్ములూరులో ఘటన

ఎస్.రాయవరం, ఆగస్టు 8: ఇల్లు ఖాళీ చేయాలంటూ తమ్ముడిపై అన్న చాకుతో దాడికి పాల్పడిన ఘటన మండలంలోని పెదగుమ్ములూరులో చోటుచేసుకొంది. దీనికి సంబంధించి ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగుమ్ములూరు గ్రామానికి చెందిన కట్టా అప్పారావు, కట్టా సుబ్బారావు అన్నదమ్ములు. వీరికి ఉన్న ఇంటిలో రెండు గదులుండగా ఇద్దరూ తమ కుంటుంబాలతో చెరో గదిలో నివాసం ఉంటున్నారు. అన్నదమ్ములిద్దరిలో పెద్దవాడైన అప్పారావు లారీ డ్రైవర్‌గా పనిచేయడానికి వెళ్లి అప్పుడప్పుడు ఇంటికి వస్తుంటాడు. అప్పారావు ఇంటికి వచ్చినప్పుడల్లా తమ్ముడైన సుబ్బారావును ఇల్లు ఖాళీ చేయాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఎప్పటి వలె పనికి వెళ్లి వచ్చిన అప్పారావు గురువారం ఇంట్లో నిద్రిస్తున్న తన తమ్ముడు సుబ్బారావుపై కూరగాయలు కోసే చాకుతో దాడి చేయడంతో మెడపై గాయమైంది. దీంతో చుట్టుపక్కల వారు రావడంతో సుబ్బారావు ప్రాణాలతో బయటపడ్డాడు. గాయపడిన సుబ్బారావును నక్కపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు చెప్పారు.


చికిత్స పొందుతున్న సుబ్బారావు

పురుగుల మందు తాగి ఆత్మహత్య

సబ్బవరం, ఆగస్టు 8 : మండలంలోని మలునాయుడుపాలెం గ్రామంలో పురుగుల మందు తాగి గురువారం ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. మలునాయుడుపాలెం గ్రామానికి చెందిన పైల సత్యనారాయణ (54) కొన్నేళ్లుగా దీర్ఘకాలిక రోగంతో బాధపడుతూ మానసికంగా వ్యధ చెందుతున్నాడన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఆందోళనకు గురై పురుగులు మందు తాగాడు. వాంతులు చేసుకుంటుండగా కుటుంబ సభ్యుల విశాఖపట్నంలోని ఒక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్టు సీఐ తెలిపారు. మృతుడు కుమారుడు మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


పైల సత్యనారాయణ (ఫైల్)

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

సబ్బవరం, ఆగస్టు 8 : పాత గంజాయి కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. 2022 జూలై 14వ తేదీన అనకపల్లి ఫ్లైఓవర్ వద్ద 100 కేజీల గంజాయి, 8 కిలోల లిక్విడ్‌తో జి.మాడుగుల ఏజెన్సీ ప్రాంతం నుంచి కేరళ తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ కేసులో అప్పుడు ఆరుగురుని అరెస్టు చేసినట్టు చెప్పారు. మరో ఇద్దరు తప్పించుకుపోయారని, వారిలో ఒక వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ కేసులో మరొక వ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

అనారోగ్యంతో ఏఎస్ఐ మృతి

సబ్బవరం/కె.కోటపాడు, ఆగస్టు 8 : సబ్బవరంలో మూడుళ్లుగా ఏఎస్ఐగా పనిచేస్తున్న జి. రామునాయుడు బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. కోటపాడు మండలం వెలంపాలెంకు చెందిన జి. రామునాయుడు 2021లో బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇటీవల అనారోగ్యం బారిన పడడంతో ఆస్పత్రిలో చికిత్స పొందు తూ బుధవారం రాత్రి మృతి చెందారు. వెలంపాలెంలో పోలీస్ లాంఛనాలతో గురువారం అంత్యక్రియలు నిర్వహించినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. మృతి చెందిన రామునాయుడుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అంత్యక్రియల్లో ఎస్ఐ ధనుంజయ్, సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.


రామునాయుడు (ఫైల్)

పాస్‌పోర్టు స్లాట్లకు డిమాండ్

» గతంలో వారంలోగా లభ్యం... ప్రస్తుతం 20 రోజుల సమయం
» ఇతర జిల్లాల నుంచి దరఖాస్తుల వెల్లువ
» త్వరలో అరకులోయ పోస్టాఫీస్‌లో పీఎస్‌కే

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పాస్‌పోర్టు స్లాట్లకు మళ్లీ డిమాండ్ ఏర్పడింది. గతంలో నెల రోజులకు గానీ స్లాట్ దొరకడం లేదని గుర్తించి స్పెషల్ డ్రైవ్ చేపట్టి వారం రోజుల్లోనే స్లాట్ దొరికేలా చేశారు. అయితే ఇప్పుడు మళ్లీ 15 రోజులు ఆగితే గాని స్లాట్ లభించడం లేదు. విదేశాంగ శాఖ పాస్‌పోర్టుల జారీ ప్రక్రియకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకుంటూ వస్తోంది. ప్రస్తుతం వెర్షన్ 2.0 అప్‌డేట్ చేస్తున్నారు. ఎక్కడైతే ఈ సాఫ్ట్‌వేర్ ప్రాసెస్‌లో ఉందో అక్కడ పాస్‌పోర్టుల స్లాట్లు, వెరిఫికేషన్, జారీ ప్రక్రియ ఆలస్యం అవుతోంది. దాంతో ఆ ప్రాంతానికి చెందినవారు ఎక్కడ స్లాట్ దొరికితే ఆ జిల్లాకు వెళ్లి వివరాలు సమర్పిస్తున్నారు.

విశాఖపట్నం పాస్‌పోర్టు ప్రాంతీయ కార్యాలయం పరిధిలో నగరంలోని బొత్స స్క్వేర్‌తో పాటు శ్రీకాకుళం, విజయనగరం, ఎలమంచిలి, కాకినాడ, రాజమహేంద్రవరం, ఏలూరు, కాకినాడల్లోని జిల్లా హెడ్ పోస్టాఫీసుల్లో పాస్‌పోర్టు సేవా కేంద్రాలు ఏర్పాటుచేశారు. అలాగే భీమవరంలో లఘు కేంద్రం నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంలో రోజుకు 410 వరకు స్లాట్లు కేటాయిస్తున్నారు. ఇప్పుడు ఎవరైనా ఇక్కడ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకుంటే ఇరవై రోజుల వ్యవధిలో స్లాట్ దొరుకుతోంది. అయితే గుంటూరుతో పాటు మరికొన్ని జిల్లాలలో తక్కువ సమయంలో స్లాట్ అందుబాటులో లేకపోవడంతో వారు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పోస్టాఫీసు కేంద్రాలకు వస్తున్నారు. అదేవిధంగా ఒడిశా నుంచి కూడా చాలామంది ఇక్కడ దరఖాస్తు చేసుకుంటున్నారు. అక్కడ కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నందున ఇక్కడికి వస్తున్నారని పాస్‌పోర్టు కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

6 నెలల సెలవులో అధికారిణి

విశాఖపట్నం పాస్‌పోర్టు ఆఫీసర్ బుధవారం నుంచి ఆరు నెలల మెటర్నటీ లీవులో వెళ్లారు. అసిస్టెంట్ పాస్‌పోర్టు అధికారికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు గ్రాంటింగ్ ప్రక్రియ కొంత జాప్యం జరిగే అవకాశం ఉంది. అధికారుల సంఖ్య తగ్గడం వల్ల అన్నీ పరిశీలించి చూసుకోవలసి ఉంటుందని చెబుతున్నారు.

అరకులోయ పోస్టాఫీసులో పీఎస్‌కే?

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీ ప్రజలకు పాస్‌పోర్టు కేంద్రం అందుబాటులో లేదు. వారు విశాఖపట్నమో, ఎలమంచిలో వెళ్లాల్సి వస్తోంది. గతంలో అరకులోయ ఎంపీగా పనిచేసిన వారు ఓ సేవా కేంద్రం పెట్టాలని కోరడంతో అధికారులు ప్రాసెస్ ప్రారంభించారు. ట్రయల్ విధానంలో అరకులోయలో పోస్టాఫీసు సేవా కేంద్రం పెట్టాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది.

ఎలమంచిలి డిగ్రీ కళాశాలలో నూతన పీజీ కోర్సు

ఎలమంచిలి, ఆగస్టు 8: ఎలమంచిలి ప్రభుత్వ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి అనలిటికల్ కెమిస్ట్రీ పీజీ కోర్సును ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం విలేకరులకు తెలిపారు. ఈ పీజీ కోర్సులో 30 సీట్లు ఉన్నాయన్నారు. ఇందులో చేరాలంటే ఏపీ పీజీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. త్వరలో ప్రారంభకానున్న కౌన్సెలింగ్‌లో ఆప్షన్‌ను నమోదు చేసుకొని ఈ కళాశాలలో చేరవచ్చునన్నారు. ఈ పీజీ కోర్సులో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

వైసీపీ పాలనలో అలా.. కూటమి ప్రభుత్వంలో ఇలా..

» అందంగా రూపుదిద్దుకున్న అన్న క్యాంటీన్ భవనం


వైసీపీ పాలనలో అధ్వానంగా మారిన అన్న క్యాంటీన్ భవనం (ఫైల్)



ప్రస్తుతం అందంగా తయారైన రైల్వేస్టేషన్ వద్ద అన్న క్యాంటీన్ భవనం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అధ్వానంగా తయారైన అన్న క్యాంటీన్లు కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లో అందంగా తయారయ్యాయి. 2018లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్కువ డబ్బులతో పేదల ఆకలిని తీర్చాలన్న ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. అప్పట్లో ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలోను, రైల్వేస్టేషన్ వద్ద జీవీఎంసీ స్థలంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం మారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లు నిలిచిపోయాయి. కనీసం భవనాలు కూడా ఏదొక విభాగాన్ని వినియోగించాలన్న ఆలోచన చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్టీఆర్ వైద్యాలయంలోని అప్పట్లో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ భవనాన్ని ల్యాబ్‌గా మార్చి వినియోగంలోకి తీసుకువచ్చారు. అయితే రైల్వేస్టేషన్ వద్ద గల అన్న క్యాంటీన్ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే అనకాపల్లి జిల్లాగా ఏర్పడింది. అయితే ఎక్కడా ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లోనే చాలా వరకు పాలన సాగింది. ఈ ఐదేళ్లలో కూడా రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పాత అన్న క్యాంటీన్ భవనాన్ని శుభ్రంగా తయారు చేసి ఏదో ఒక విభాగానికి కేటాయించి వినియోగించకపోవడంతో భవన అధ్వానంగా మారింది. పరిసరాల్లో తుప్పలు బలిసిపోయాయి. చీకటి పడితే మందుబాబులకు ఆవాస కేంద్రంగా మారిందన్న ప్రచారం కూడా సాగింది. అయితే రెండు నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్లు మళ్లీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో అధ్వానంగా రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పాత అన్న క్యాంటీన్ భవనానికి మోక్షం లభించింది. జీవీఎంసీ అధికారులు రూ.11 లక్షలతో రైల్వేస్టేషన్ వద్ద గల అన్న క్యాంటీన్ భవనాన్ని ఆధునీకీకరించి సుందరంగా తీర్చిదిద్దారు. వైసీపీ పాలనలో అధ్వానంగా ఉన్న భవనానికి ప్రస్తుతం అభివృద్ధి చెందిన భవనాన్ని చూస్తే ఎంత తేడా ఉందోనని స్థానికులు పేర్కొంటున్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపం

» మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ, ఆగస్టు 8: నీటి పారుదల శాఖ, రోడ్లు, భవనాల శాఖలను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, దీని వల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం ఆయన మర్లగుమ్మి ఆనకట్టను ఇరిగేషన్‌శాఖ డీఈఈ చింతల వేణుగోపాలనాయుడు, ఏఈఈ సీహెచ్ జయరాంపడాల్, నీటి సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. మర్లగుమ్మి ఆనకట్ట షట్టరు, పక్కన ఉన్న గోడ కూలిపోయిందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న జలాశయాల మరమ్మతు పనులను వెంటనే చేయించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించి దానికి తగిన నిధులు కూడా కేటాయించారని తెలిపారు. మాడుగుల నియోజకవర్గంలో మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో ఉన్న జలాశయాల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఈ ప్రతిపాదనలను నీటి పారుదలశాఖా మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళతామన్నారు. రైవాడ జలాశయం మరమ్మతులకు గత ప్రభుత్వం రూ.22 కోట్లు కేటాయించినా, దీనిలో రూ.5 కోట్లు పనులు చేసినా కాంట్రాక్టర్‌కి బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలుపుదల చేశారన్నారు. ఆ బిల్లులు చెల్లించి మిగతా పనులు అయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. జలాశయాల్లో నెలకొన్న అన్ని సమస్యలు పరిష్కరించి ప్రతిరైతుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.


మర్లగుమ్మి ఆనకట్టను పరిశీలిస్తున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు

యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లకు అందని వేతనాలు

» నాలుగు నెలలుగా నిలిపివేత » ఇబ్బంది పడుతున్న శిక్షకులు
» ఆయుష్‌శాఖాధికారుల చిన్నచూపు

నక్కపల్లి, ఆగస్టు 8: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు, గ్రామస్థులకు యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి వాటిపై శిక్షణ ఇచ్చేందుకు నియమించిన యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. వీరిని 2022 మార్చి నెలలో ఆయుష్ శాఖ నియమించింది. మేల్ యోగా గెస్ట్ ఇన్‌స్ట్ర క్టర్లకు నెలకు 32 గంటలు, ఫిమేల్‌కు నెలకు 20 గంటలు చొప్పున యోగా శిక్షణ ఇవ్వాలనే షరతు విధించారు. వీరు చెప్పే ప్రతి గంటకు రూ.250 చొప్పున 32 గంటలకు పురుషులకు నెలకు రూ. 8,000, మహిళలకు నెలకు రూ.5000 చొప్పున నిర్ణయించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 8 ఆయుర్వేద డిస్పెన్సరీలు వున్నాయి. మధురవాడ, సింహాచలం, అనకాపల్లి, కొరుప్రోలు, ఎం.కోడూరు, నర్సీపట్నం, కర్నూలుపాలెం, వేంపాడు డిస్పెన్సరీల పరిధిలో 15 మంది పురుష, మహిళా యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. వీరు ఏ పాఠశాలలో విద్యార్థులకు యోగా నేర్పుతున్నారో అక్కడ ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే వారు చెప్పిన గంటలకు వేతనం వచ్చేది. ఇందులో చాలా మార్పులు చేయడంతో యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ట్రాన్స్‌పోర్టు చార్జీలు అధికమయ్యేవి. వీరికి ఇచ్చే వేతనంలో చాలా మేరకు రవాణా ఖర్చులు అయ్యేవి. అయినా యోగా తరగతులు నిర్వహించడంలో వీరు ఎప్పుడూ అలసత్వం ప్రదర్శించలేదు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లకు వేతనాలు ఇవ్వలేదు. దీంతో వీటిపైనే ఆధారపడ్డ యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యోగా అటెండెన్స్, ఇతర వ్యవహారాలను మోనటరింగ్ చేసే ఆయుష్ ప్రధాన కార్యాలయంలోని అధికారులను ఫోన్లో సంప్రదిస్తే వారిపై రుసరుసలాడుతున్నారు. కూటమి ప్రభుత్వం తమ దీనస్థితిని అర్థం చేసుకుని, బకాయి వేతనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. తమ దీనస్థితిపై మంత్రులు లోకేశ్, పవన్ కల్యాణ్, వంగలపూడి అనితలను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామని ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన యోగా గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్లు అంటున్నారు.


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

సెజ్‌లో ఎలక్ట్రానిక్ కర్మాగారానికి స్థలం కేటాయింపు

» ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాదరావు

అచ్యుతాపురం, ఆగస్టు 8: అచ్యుతాపురం సెజ్‌లో ఎలక్ట్రానిక్ కర్మాగారానికి భూమిని కేటాయించామని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 'సెజ్‌లో ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు నిల్' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు.. సబ్‌స్ట్రేట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కర్మాగారం ఏర్పాటుకు సెజ్‌లో ప్లాట్ నంబర్ 40, 41లో 20.05 ఎకరాల భూమిని కేటాయించామన్నారు. ఈ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ 2024 జూలై పదో తేదీన జరిగిందన్నారు. దీనికి 2024 అక్టోబరులో భూమిపూజ జరగనుందన్నారు. ఈ కర్మాగారంలో పవర్డ్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఏక్ససిరీస్, స్మార్ట్‌హోం టెక్నాలజీ, బిల్డింగ్ టెక్నాలజీ, బిల్డింగ్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇంతవరకు సాఫ్ట్‌వేర్ కర్మాగారాలకు సెజ్‌లో అనుమతులు ఇవ్వలేదని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాదరావు పేర్కొన్నారు.

ఇసుక డోర్ డెలివరీ

త్వరలో రీచ్‌ల నుంచి నేరుగా ఇంటికే సరఫరా

» కిలోమీటర్ల ప్రాతిపదికన రవాణా చార్జీలు
» మరింత తగ్గనున్న ధర
» భీమిలి, అగనంపూడిల్లో ప్రస్తుతం ఉన్న నిల్వలు అయిపోయిన తరువాత » డిపోలు ఎత్తివేత
» శ్రీకాకుళం జిల్లాలో ఒక రీచ్ పూర్తిగా విశాఖ జిల్లా అవసరాలకు కేటాయించాలని అధికారుల ప్రతిపాదన

విశాఖపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):

విశాఖ నగరంలో ఇసుక డోర్ డెలివరీకి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లుచేస్తోంది. శ్రీకాకుళం/రాజమండ్రిల్లో గల రీచ్‌ల నుంచి నేరుగా వినియోగదారుడి ఇంటికి చేరేలా ప్రణాళిక రూపొందిస్తుంది. ప్రస్తుతం నగర పరిధిలో గల భీమిలి, అగనంపూడిల్లో ఉన్న ఇసుక డిపోలను ఎత్తివేయనున్నారు.

విశాఖ నగర పరిధిలో నిర్మాణాలకు నెలకు సగటున 30 నుంచి 35 వేల టన్నుల ఇసుక అవసరం. ఇసుక అవసరమైనవారు తమ పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయానికి వెళ్లి ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తే..రెండు, మూడు రోజుల వ్యవధిలో నేరుగా ఇంటికే వాహనం ద్వారా పంపనున్నారు. దీని కోసం శ్రీకాకుళం జిల్లాలో ప్రత్యేకంగా ఒక రీచ్‌ను విశాఖ జిల్లాకు కేటాయించేలా చూడాలని ప్రభుత్వానికి జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం భీమిలి, అగనంపూడి డిపోల్లో ఉన్న ఇసుక అమ్మకాలు పూర్తయిన తరువాత డోర్ డెలివరీ విధానం అందుబాటులోకి తీసుకురానున్నారు. డోర్ డెలివరీ విధానం వల్ల ప్రస్తుతం ఉన్న రేటు మరింత తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. రీచ్‌ల నుంచి వినియోగదారుడి ఇంటికి ఇసుక తీసుకువచ్చేందుకు కిలోమీటర్ల ప్రాతిపదికన రవాణా చార్జీలు నిర్ణయిస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక డిపో నుంచి వినియోగదారుడి ఇంటికి రవాణాకు కిలోమీటరుకు ఇంత అని నిర్ణయించి చార్జీలు వసూలు చేసేవారు. ఈ విధానం గాడిలో పడే సమయంలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో మొత్తం గందరగోళంగా మారింది. ప్రైవేటు వ్యక్తులు నేరుగా నదుల్లోని రీచ్‌లు లేదా ఒడిశా నుంచి తెచ్చుకునేవారు. ఇదిలావుండగా విశాఖలో ప్రధాన నదులు లేనందున శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో గోదావరి నదుల్లోని రీచ్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక విధానంలో గందరగోళం ఏర్పడడంతో టన్ను ఇసుక ఇంటికి చేరేసరికి రూ.1,600 నుంచి రూ.1,800 వరకు ఖర్చయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు ఏజెన్సీలు నదుల నుంచి తీసుకువచ్చిన ఇసుక ఎక్కువగా డిపోల్లో ఉండిపోయింది. ఈ విధంగా విశాఖ జిల్లాలో సుమారు రెండు లక్షల టన్నులు స్టాకు ఉన్నట్టు గుర్తించారు.

ఆ ఇసుకను కాంట్రాక్టర్లు నిర్ణయించిన రేటుకు విక్రయించాల్సి ఉంది. కానీ, కొత్త ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులోకి తీసుకురావడంతో అగనంపూడి డిపోలో టన్ను రూ.1,394, భీమిలిలో రూ.758 చొప్పున విక్రయాలు చేపట్టారు. తరువాత రెండు డిపోల మధ్య రేటు తేడాను సరిచేసి రూ.1,076గా ఖరారు చేశారు. భీమిలిలో మరో పది వేల టన్నుల వరకు ఇసుక నిల్వలు ఉండగా, అగనంపూడిలో సుమారు 50 వేల నుంచి 60 వేల టన్నులు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. రెండు డిపోల్లో ఇసుక పూర్తిగా అమ్మేసిన తరువాత వాటిని మూసివేస్తారు. డిపోలతో పనిలేకుండా నేరుగా రీచ్‌ల నుంచి నిర్మాణదారుడి ఇంటికి డోర్ డెలివరీ చేయాలని నిర్ణయించారు.

దీనివల్ల ప్రస్తుతం ఉన్న రేటు కంటే తక్కువకే ఇసుక లభించే అవకాశం ఉందంటున్నారు. దీనిపై గనుల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ చర్చించారు. విశాఖ జిల్లా వాసుల కోసం శ్రీకాకుళంలో ప్రత్యేకంగా ఒక రీచ్ కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యేకంగా రీచ్ కేటాయిస్తే ఇప్పుడున్న రేటు కంటే తక్కువగా డోర్ డెలివరీ చేయవచ్చునని అంచనా వేస్తున్నారు.

తాండవలో పెరుగుతున్న నీటి నిల్వలు

» రైతుల ఆనందం


తాండవలో 375 అడుగులకు చేరుకున్న నీటి నిల్వలు

నాతవరం, ఆగస్టు 8: తాండవ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. రెండు రోజుల నుంచి తాండవ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తాండవలో నీటి నిల్వలు పెరుగుతుండడంతో తాండవ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 375 అడుగులకు నీటినిల్వలు చేరుకున్నాయి. ఇన్‌ఫ్లో ద్వారా 400 క్యూసెక్కుల నీరు వస్తుందని తాండవ డీఈఈ అనురాధ తెలిపారు. గత ఏడాది తాండవలో ఆగస్టు 8వ తేదీ నాటికి 369 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. గత జూలై నెల వరకు తాండవలో ఆశించినంత నీటి నిల్వలు లేక రైతులు ఆందోళన చెందగా, ప్రస్తుతం తాండవలో నీటి నిల్వలు 375 అడుగులకు చేరుకోవడంతో ఖరీఫ్ సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు చెబుతున్నారు. అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 52 వేల ఎకరాలకు సాగునీరు అందించే తాండవ రిజర్వాయర్‌లో 375 అడుగుల నీటి నిల్వలు ఉండడంతో తాండవ ఆయకట్టు రైతులు వరినారు సిద్ధం చేసుకుని తాండవ నీరు విడుదల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే పల్లపు ప్రాంత రైతులు ఆగస్టు 15వ తేదీనే తాండవ నీరు విడుదల చేయాలని కోరుతుండగా, మెట్టప్రాంత రైతులు మాత్రం ఇంకా వరినారు ఎదగాలని ఆగస్టు 20వ తేదీ తర్వాతనే తాండవ నీరు విడుదల చేయాలని కోరుతున్నారు.

జీవో 117 రద్దు తరువాతే ఉపాధ్యాయుల సర్దుబాటు

» యూటీఎఫ్ నేతల డిమాండ్


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయ్, సంఘం నేతలు

చోడవరం, ఆగస్టు 8: జీవో నంబర్ 117ను రద్దు చేసిన తరువాతే రాష్ట్రంలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ డిమాండ్ చేశారు. గురువారం ఎంఈవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన 117 జీవో వల్ల విద్యారంగం అస్తవ్యస్తంగా మారి, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని వాపోయారు. కూటమి ప్రభుత్వం సదరు జీవోను రద్దు చేయకుండానే ఉపాధ్యాయుల సర్దుబాటుకు పూనుకోవడం సరికాదన్నారు. ఈ జీవో రద్దు చేయకపోతే మెగా డీఎస్సీ నియామకాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఈ జీవోను రద్దు చేసి పాత జీవో 53 ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఒకే పాఠశాలలో తరగతులు నిర్వహించడం ద్వారా ప్రాథమిక విద్యావ్యవస్థను రక్షించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ మండల నాయకులు బొడ్డపాటి రామచంద్రరావు, నందికోళ్ల గణేశ్, ఉగ్గిన సత్యనారాయణ, బాబ్జీ, ఆరిపాక రాజారమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో పూల ధరలు

» శ్రావణమాసం రావడంతో పెరిగిన ధరలు
» కనకాంబరాలు కిలో రూ.3 వేలు
» చామంతులు రూ.400


అనూహ్యంగా పెరిగిన కనకాంబరాల ధర

నక్కపల్లి, ఆగస్టు 8: శ్రావణ మాసంలో నెల రోజులు పూజలు చేసే మహిళలు పూలను ఎక్కువగా వినియోగిస్తుంటారు. శ్రావణమాసం రావడంతో పూల ధరలు బాగా పెరిగాయి. గురువారం జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, పాయకరావుపేట, అడ్డరోడ్డు మార్కెట్లలో పూల అమ్మకాలు పెద్ద ఎత్తున జరిగాయి. గురువారం నాటికి కిలో కనకాంబరాల ధర రూ.3వేలు పలకగా, చామంతుల ధర కిలో రూ.400లకు చేరింది. మల్లెపూల ధరలైతే మూర రూ.100లకు విక్రయిస్తున్నారు. వచ్చే వారానికి చామంతుల ధర మరింత పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ ప్రాంత వర్తకులు కడియం తదితర ప్రాంతాల నుంచి పూలను కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నారు. వీటి ధరలు పెరిగిపోవడంతో తాము కూడా పెట్టుబడులు పెట్టలేకపోతున్నామని పూల వ్యాపారులు చెబుతున్నారు. శ్రావణమాసంలో వచ్చే శుక్రవారం రోజున లక్ష్మీదేవి అమ్మవారిని చామంతులతో పూజించడం పూర్వం నుంచి ఆచారంగా వస్తోంది. చామంతులతో పాటు, కనకాంబరాలను కూడా అమ్మవారికి అలంకరించిన అనంతరం వాటిలో కొన్ని పూలను మహిళా భక్తులు ధరిస్తారు. అందువల్ల పూల ధరలు చుక్కలను తాకుతున్నాయనే చెప్పాలి.

చట్టాల అధ్యయనం నిరంతర ప్రక్రియ

» ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు


జస్టిస్ సోమయాజులును జ్ఞాపికతో సత్కరిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు

సబ్బవరం, ఆగస్టు 8 : చట్టాల అధ్యయనం నిరంతర ప్రక్రియ అని ఏపీ హైకోర్టు మాజీ న్యాయ మూర్తి జస్టిస్ సోమ యాజులు అన్నారు. గురువారం సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో నూతనంగా పీజీలో చేరిన విద్యార్థు లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టంలో జరిగే మార్పులను నిరంతరం గమనిస్తూ.. వాటిని అధ్యయనం చేసినప్పుడే విద్యార్థులు న్యాయవాద వృత్తిలో రాణించగలరన్నారు. కార్పొరేట్, మీడియేషన్ రంగాల్లో రాణించాలంటే వాటిలో మార్పులను అర్థం చేసుకోవాలని జస్టిస్ సోమయాజులు అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మధ్యవర్తిత్వ రంగంలో ఎక్కువగా అవకాశాలు లభిస్తున్నాయని, కానీ ఎక్కువగా లిటిగేషన్ వైపు రావలసిన అవసరం ఉందన్నారు. ట్రయల్ కోర్టులో ప్రాక్టీస్ చేసినప్పుడే ఒక నిపుణుడైన న్యాయవాదిగా రాణించగలరన్నారు. వీసీ డి. సూర్యప్రకాశరావు మాట్లాడుతూ.. న్యాయవాది వృత్తిలో అనేకమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించిన గెస్ట్ హౌస్‌ను జస్టిస్ సోమయాజులు ప్రారంభించారు. జస్టిస్ సోమయాజలను వీసీ ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ నందినీ సీపీ, అకాడమిక్ డీన్ సోమభట్టాచార్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవో నం.3 అమలు చేయాలి



మంత్రిని కలిసిన బొజ్జన్న

చింతపల్లి, ఆగస్టు 8 : ఆదివాసీ నిరుద్యోగ యువతకు శతశాతం రిజర్వేషన్ కల్పించే జీవో నంబరు-3 అమలు చేయాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కోరినట్టు ఆదివాసీ సంఘం నాయకుడు బచ్చెలి బొజ్జన్న తెలిపారు. గురువారం సచివాలయంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రిని కలిసిన ఆయన పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొని వెళ్లారు.

పీఏసీఎస్‌ల బలోపేతానికి పటిష్ఠ చర్యలు : కలెక్టర్

» రుణాలు మంజూరు, వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్ కుమార్

పాడేరు, ఆగస్టు 8 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశంలోకలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 22 సహకార సంఘాలు పని చేస్తున్నప్పటికీ పురోగతి సాధించడం లేదన్నారు. సంఘాల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లిచడం లేదన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌ల ద్వారా పంపిణీ చేస్తున్న వ్యవసాయ రుణాలను విస్తృతం చేయాలన్నారు. ఎకరాకు రూ.లక్ష రుణం చెల్లిస్తున్నారని, ఈ రుణం వసూలు చేయడంలో సిబ్బంది శ్రద్ధ తీసుకోవడంలేదన్నారు. సహకార సంఘాల ద్వారా జరుగుతున్న మోసాలను అరికట్టాలన్నారు. సహకార సంఘాలన్నీ కంప్యూటరీకరణ జరగాలన్నారు. జిల్లాలో నిర్మిస్తున్న 42 గోదాముల్లో పూర్తికాబడిన ఐదు గోదాములను అద్దెకు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని సంఘాలకు శాశ్వత భవనాలు లేవని, ఈమేరకు మండల కేంద్రం గ్రామ సచివాలయంలో నిర్మించిన నిలువు గదులను కేటాయించాలని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ-కిషాన్ ఉపజ్‌నిధి కింద గోదాములను అక్రిడిటేషన్ చేయించాలన్నారు. డీఆర్‌డీఏ మహిళ సంఘాల సభ్యులకు వ్యవసాయేతర రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, సహకార అధికారి ఎంవీ రామకృష్ణంరాజు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బీఎస్ నంద్, పశుసంవర్ధకశాఖ అధికారి నరిసింహులు, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, డీసీసీబీ జనరల్ మేనేజర్లు శ్రీనివాసరావు, శ్రీధర్ చౌదరి, మేనేజర్లు ఈఈ కొండయ్యపడాల్ పాల్గొన్నారు.

ప్రత్యేక సస్యరక్షణ అవసరం

చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి



దుచ్చరిపాలెంలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 8 : పంటల పరిరక్షణలో రైతులు ప్రత్యేక సస్యరక్షణ చేపట్టాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దుచ్చరిపాలెంలో శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. పలు పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ వర్షాల వల్ల పొలాల్లో చేరే నీరు బయటకు పోయేలా చూసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో తిక్క ఆకుమచ్చ తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ఒక లీటరు నీటిలో ఒక గ్రాము కార్బెండిజం గాని, 2.5గ్రాముల మ్యాంకోజబ్ చొప్పున పంటపైన పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మధుసుదనరావు పాల్గొన్నారు.

సిల్వర్ మొక్కలను సద్వినియోగం చేసుకోవాలి

» ఐటీడీఏ పీవో అభిషేక్



మొక్క నాటుతున్న పీవో అభిషేక్

హుకుంపేట ఆగస్టు 8 : ఉపాధి హామీ పథకం కింద అందిస్తున్న సిల్వర్ మొక్కలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ పేర్కొన్నారు. గురువారం హుకుంపేట పంచాయతీ దిగుడుపుట్టు సంతరి పంచాయతీ పరిధిలోని గ్రామాలను పీవో సందర్శించారు. ఈ సందర్భంగా 32 మంది రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద రైతులకు సిల్వర్ మొక్కలు అందించి జంగిల్ పనులకు కూడా డబ్బులు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ 38 మంది రైతులకు 26600 మొక్కలు అందించనున్నట్టు చెప్పారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాఫీ, మిరియాలు, పండ్లు మొక్కల వేసి ఆర్థికంగా ఎదగాలని పీవో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాస్ పవన్, ఏపీవో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జీవో నం.3కు చట్టబద్ధత

మాజీ ఎంపీ మిడియం బాబూరావు డిమాండ్

పాడేరు రూరల్, ఆగస్టు 8 : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జీవో నెంబరు-3 రిజర్వేషన్‌కు చట్టబద్ధత చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు 9న ప్రకటన చేయాలని మాజీ ఎంపీ, ఆదివాసీ అధికార్ రాష్ట్ర మంచ్ జాతీయ ఉపాధ్యక్షులు మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పీఎంఆర్సీ సమావేశ మందిరంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్న పడాల్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఆదివాసీ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ ప్రకటన చేయాలని, పోలవరం వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ అధికార్ రాష్ట్ర మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్, జిల్లా నాయకులు బి.చిన్నయ్యపడాల్, పి.శ్రీను, ఎం.చిట్టిబాబు, చిన్నంనాయుడు, జీవన్ కృష్ణ, కార్తీక్, ఈశ్వరి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఈ-క్రాప్ : ఏవో



మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరావు

చింతపల్లి, ఆగస్టు 8 : మండలంలో ఈ-పంట నమోదుపై వీఆర్వోలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని స్థానిక వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఈ-పంట నమోదుపై వీఆర్వోలకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలంలో ఈ-పంట నమోదు కార్యక్రమం ప్రారంభమైందన్నారు. రెవెన్యూ శాఖ వీఆర్వోలు, గ్రామ సచివాలయం ఉద్యాన, వ్యవసాయ సహాయకులు కలిసి ఈ-పంట నమోదు చేయాలన్నారు. ఈ-పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయని, పంట బీమా పథకం వర్తిస్తుందన్నారు. వచ్చే నెల 15లోగా ఈ-పంట నమోదు పూర్తి చేయాల్సివున్నదన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ఉప తహసీల్దార్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురైన విద్యార్థి

సకాలంలో వైద్య అందడంతో తప్పిన ప్రాణాపాయం

సీలేరు, ఆగస్టు 8 : జీకేవీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థి విద్యుదాఘాతానికి గురయ్యాడు. సకాలంలో పీహెచ్‌సీకి తరలించండంతో ప్రాణాపాయం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక హైస్కూలులో 8వ తరగతి చదువుతున్న కొర్రా సంజన నాలుగు గంటల సమయంలో తోటి పిల్లలతో ఆడుకుంటూ విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే ఉపాధ్యాయులు, విద్యార్థులు స్పందించి స్థానిక పీహెచ్‌సీకి తరలించడంతో ప్రమాదం తప్పిందని వైద్యులు తెలిపారు.

సికిల్‌సెల్ ఎనిమియాపై కళాజాతలు



డుంబ్రిగుడలో కళాజాత

డుంబ్రిగుడ, ఆగస్టు 8 : సికిల్‌సెల్ ఎనీమియాపై పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యాన డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జైశంకర్ శివ శంకర్ కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి రక్తకణాల సంఖ్య తగ్గుముఖం పడుతుందన్నారు. సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలను ఆస్పత్రితో పాటు గ్రామాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. మంచి పోషకాహారాన్ని విధిగా తీసుకోవాలని సూచించారు. అరకు పంచాయతీ కేంద్రంలో వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అంబిక, నజీబ్, ఎంపీఈహెచ్‌వో శౌరి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : సికిల్‌సెల్ ఎనిమియా బాధితులు తరచూ వైద్య పరీక్షలను చేయించుకోవాలని ధారకొండ వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ధారకొండ ఆశ్రమ ఉన్నత పాఠశాల, చిన్నగంగవరం గ్రామాల్లో గురువారం సికిల్‌సెల్ ఎనీమియా పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళా జాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో పోతురాజు, ఎంఎల్‌హెచ్‌పీలు నాగమణి, లోవకుమారి పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు కరువు

బీజేవైఎం నేత మత్స్యకొండబాబు

పాడేరు రూరల్, ఆగస్టు 8 : పాడేరులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మత్స్య కొండబాబు డిమాండ్ చేశారు. గురువారం బీజేవైఎం బృందం ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యం తీరు, ఆస్పత్రిలో రోగులు, సహాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో మందులు ఇవ్వకపోవడం, తాగునీటి లేకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి జిల్లా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పి.ఈశ్వరరావు, ఎన్.శివకృష్ణ, పి.భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పాట్లు

... 5వ పేజీ తరువాయి

పోరాడారు. అనంతరం అధికారులు ప్రతిపాదనలు పంపడంతో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వంతెన శంకుస్థాపన చేసిన వైసీపీ పాలకులు నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని గెడ్డ అవతల గ్రామాల గిరిజనులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి తక్షణమే అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం పూర్తి చేసి తమ గ్రామాలకు రవాణాకష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

ఆదివాసీల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

» గిరిజన ఉద్యోగుల సంఘం పిలుపు

చింతపల్లి, ఆగస్టు 8 : స్థానిక ఆర్టీసీ మైదానంలో శుక్రవారం జిల్లా స్థాయి ఆదివాసీల దినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి గెమ్మెలి మోహన్‌రావు తెలిపారు. ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజన ప్రజలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు జీవో నంబరు-3 అమలు, భూబదలాయింపు, అటవీ హక్కులు, పీసా చట్టాలు పటిష్టం, భూ ఆక్రమణలు, ఆదివాసీలను నిర్వాసితులను కీడు చేసే యర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును అడ్డుకోవడం తదితర సమస్యలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ సమావేశంలో గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు గిడ్డి వరలక్ష్మి, బౌడు గంగరాజు, దేశగిరి శశికుమార్ పాల్గొన్నారు.

వీడిన మిస్టరీ

... 5వ పేజీ తరువాయి

పెద్ద దుంగను నిలువగా పాతారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో మృతదేహం పొలాల్లోకి కొట్టుకువచ్చింది. ఈనెల మూడో తేదీన మృతదేహాన్ని రైతులు చూసి స్థానిక సర్పంచ్‌కు సమాచారం అందించారు. ఆయన... డుంబ్రిగుడ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఇదిలావుండగా కొట్లాట జరిగిన తర్వాత పారిపోయిన ముగ్గురు కంచరపాలెం యువకులు నగరానికి చేరుకుని చంద్రకాంత్ ఇంటికి వెళ్లారు. తామంతా అరకులోయ వెళ్లామని, అక్కడ అదృశ్యమయ్యాడని అతని తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో జూలై 31న కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో చంద్రకాంత్ మిస్సింగ్ కేసు నమోదైంది. ఆ వివరాలు, ఫొటో డుంబ్రిగుడ పోలీస్ స్టేషన్‌కు పంపారు. అదే సమయంలో ఈనెల 3వ తేదీన గెడ్డలో మృతదేహం బయటపడింది. అది చంద్రకాంత్‌దేనంటూ తల్లిదండ్రులు గుర్తించారు. దీంతో సీఐ రుద్రశేఖర్ ఆధ్వర్యంలో అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ ఎస్‌ఐలు, సిబ్బంది బృందాలుగా విడిపోయి దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ హత్యలో పాల్గొన్న డుంబ్రిగుడ మండలానికి చెందిన ఏడుగురు, అరకులోయ మండలానికి చెందిన ఒకరు మొత్తం ఎనిమిది మందిని గుర్తించి, అరెస్టు చేశామని సీఐ రుద్రశేఖర్ తెలిపారు. వీరిలో ముగ్గురు మైనర్లు కాగా...మిగిలిన ఐదుగురిలో డుంబ్రిగుడ మండలం బల్యాగుడ, తూటంగి, నిమ్మగడ్డ, శరత్‌నగర్, కిల్లోగుడ గ్రామాలకు చెందిన పాంగి రాజు (19), తాంగుల అజయ్‌లాల్ (20), శెట్టి కిరణ్ (19), గొలుసు చైతన్య (19) కాగా, అరకులోయ మండలం సిరగంకు చెందిన వంతల హిమరాజు (19) ఉన్నారు. వీరితో పాటు ముగ్గురు మైనర్లను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచినట్టు చెప్పారు. మైనర్లను జువెనైల్ హోమ్‌కు తరలించనున్నట్టు సీఐ రుద్రశేఖర్ తెలిపారు.

సీలేరు నదిలో 15 కిలోల గెలస్కోప్ చేప లభ్యం

» రూ. 3 వేలకు మార్కెట్‌లో విక్రయం



మత్స్యకారుడి వలకు చిక్కిన 15 కేజీల గెలస్కోప్ చేప →

సీలేరు, ఆగస్టు 8: సీలేరు నదిలో 15 కేజీల గెలస్కోప్ చేప గురువారం మత్స్యకారుడి వలకు చిక్కింది. ఈ రకం చేపలు సీలేరు నదిలో వర్షాకాలంలో లభిస్తాయి. ఈ చేప సీలేరు నదిలో మంగవపాడు వద్ద బంగారుశెట్టి అనే మత్స్యకారుడి వలకు చిక్కడంతో దీనిని సీలేరు మార్కెట్‌కు తీసుకొచ్చి రూ.3 వేలకు విక్రయించారు. ఈ ఏడాది ఈ చేప మత్స్యకారుల వలకు చిక్కడం ఇది మూడోసారి.

వినియోగంలోకి నాలుగో విద్యుత్ యూనిట్

సీలేరు, ఆగస్టు 8 : సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో గురువారం నుంచి నాలుగో నంబరు యూనిట్ వినియోగంలోకి వచ్చింది. ఈ యూనిట్ 45 రోజుల క్రితం బస్‌డెక్‌లో వర్షపు నీరు చిమ్మి సాంకేతిక లోపాలు తలెత్తి యూనిట్‌లో విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. జెన్‌కో అధికారులు యూనిట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేసినప్పటికీ విపరీతమైన వర్షాల కారణంగా స్టాటర్ మెగ్గర్ వ్యాల్యుస్ రాలేదు. దీంతో శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రం నుంచి హాట్ బ్లోయర్‌ను తీసుకొచ్చి మెగ్గర్ వ్యాల్యుస్ వచ్చేలా చర్యలు చేపట్టారు. బస్‌డెక్‌లోకి వర్షపు నీరు చిమ్మకుండా చర్యలు చేపట్టారు. వర్షాలు తగ్గుముఖం పట్టడం, మెగ్గర్ వ్యాల్యుస్ రావడంతో యూనిట్‌లో విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. ఈ సందర్భంగా జలవిద్యుత్ కేంద్రం ఈఈ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జలవిద్యుత్ కేంద్రంలో 4వ యూనిట్ వినియోగంలోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం 3 యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అన్ని చోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలవిద్యుత్ కేంద్రాల్లో కూడా విద్యుదుత్పత్తి చేస్తున్నందున సీలేరులో రెండు యూనిట్లు ద్వారా మాత్రమే విద్యుదుత్పత్తిని చేస్తున్నామన్నారు. 1వ నంబర్ యూనిట్ కూడా మరో నాలుగు రోజుల్లో వినియోగంలోకి వస్తోందని ఈఈ చెప్పారు.

ఆదివాసీల అభివృద్ధి ఎండమావేనా?

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. ప్రధానంగా తాగునీటి సదుపాయాలు అధ్వానంగా ఉండడంతోనే గిరిజనులు తరచూ రోగాల బారిన పడుతున్నారని తెలిసినా పాలకులు రక్షిత తాగునీటి సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలో భౌగోళిక మార్పుల కారణంగా అధిక సంఖ్యల్లో గ్రామాల్లోని బోర్లు, బావులు, గ్రావెటీ నీటి పథకాలు అడుగంటి ఇంకిపోతున్నాయి. దీంతో ప్రత్యామ్నాయంగా ఊటగెడ్డల్లో నీటిపైనే ఆధారపడుతున్నారు. సాంకేతికతను వినియోగించి గిరిజనులకు అవసరమైన రక్షిత నీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. కనీసం పంచాయతీ కేంద్రాల్లోనైనా రక్షిత తాగునీటిని అందించేందుకు కృషి చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. అలాగే రోడ్డు, రవాణా విషయాలకు వస్తే మరింత దారుణమైన పరిస్థితులు కొనసాగుతున్నాయి. నేటికీ ఏజెన్సీలో వందల సంఖ్యలోని పల్లెలకు రోడ్లు లేకపోవడంతో ఆయా ప్రాంతాలకు రవాణా సదుపాయాలు కల్పించని దుస్థితి నెలకొంది.

ఇక విద్య విషయానికి వస్తే.. అంతా మేడిపండు చందంగానే ఉంది. ఏజెన్సీలో నేటికీ బడులకు భవనాలను లేని పరిస్థితి నెలకొనగా, ఉన్న పాఠశాలల్లోని గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదనే వాదన వినిపిస్తున్నది. ప్రధానంగా డీఈవో, ఏజెన్సీ డీఈవో కార్యాలయాల్లోనే నేటికీ అనేక కీలక పోస్టులు ఖాళీగా ఉండడంతో గిరిజన విద్య మేడి పండులా మారిందనే విమర్శలున్నాయి.

గిరిజనుల జీవనాధారమైన వ్యవసాయంపై పాలకుల నిర్లక్ష్యం చెప్పలేనిది. ఏజెన్సీలో దాదాపు 80 శాతం మంది భూమిపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ, ఆ స్థాయిలో గిరిజన రైతులకు ప్రభుత్వాల నుంచి సాయం అందడం లేదు. లోకమంతా వ్యవసాయ రంగంలో దూసుకువెళుతుంటే గిరి రైతులు మాత్రం ఇంకా వెనుకబాటులోనే ఉన్నారు.

స్వయం ఉపాధి, చిన్నతరహా పరిశ్రమల గురించి మన్యంలో మాట్లాడుకోవడానికే అవకాశం లేదు. గిరిజనాభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధి లేనంత కాలం ఎన్ని ఆదివాసీ దినోత్సవాలను నిర్వహించుకున్నా, అది అడవి గాచిన వెన్నెలగానే మిగులుతుందనేది అక్షర సత్యం.

కూటమి ప్రభుత్వంపైనే అడవి బిడ్డల ఆశలు

గత వైసీపీ ప్రభుత్వానికి భిన్నంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తుండడంతో రానున్న ఐదేళ్లలోనైనా తమకు ఎంతో కొంత న్యాయం జరుగుతుందని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రోడ్డు, రవాణా వ్యవస్థలతో పాటు విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే కొంతమేరకు మేలు జరుగుతుందని అడవి బిడ్డలు ఆశ పడుతున్నారు.

☛ సంక్షిప్తంగా..

ఇంటర్ పుస్తకాల పంపిణీ

సీలేరు, ఆగస్టు 8 : జీకేవీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు గురువారం ఉచిత పుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నదని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

14న మండల సర్వసభ్య సమావేశం

కొయ్యూరు, ఆగస్టు 8 : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 14న మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనునట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. మండలాధ్యక్షుడు బడుగు రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలో గల 33 పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

వలంటీర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు, ఆగస్టు 8 : మండలంలో పాఠశాలలు లేని ఆవాస గ్రామాల్లో నాన్-రెసిడెన్షియల్ ట్రైనింగ్ సెంటర్ల (ఎన్ఆర్ఎస్టీ)లో వలంటీర్ల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ఎంఈవో రాంబాబు తెలిపారు. ఆగస్టు, సెప్టెంబరు నుంచి ఫిబ్రవరి 2025 వరకు పని చేసేందుకు వీలుగా నియామకాలు ఉంటాయని స్పష్టం చేశారు. డీఎడ్ చేసిన వారు అర్హులన్నారు. టెట్ అర్హత కలిగి ఉండడం, స్థానికులకు ప్రాధాన్యమని తెలిపారు. మండలంలో జోగంపేట, కొమ్మనూరు, ఉసిరికపాడు, బొడ్డుమామిడిలంక, ఈదులబంద, గంపరాయి, పుట్టకోట, వైఎన్ పాకలు గ్రామాలకు సంబంధించి ఈ వలంటీర్ల పోస్టులు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాని ఎంఈవో తెలిపారు.

షెడ్ల నిర్మాణంలో రైతుల భాగస్వామ్యం

డుంబ్రిగుడ, ఆగస్టు 8 : పశువుల షెడ్ల అభివృద్ధిలో గిరిజన రైతులు భాగస్వాములయ్యేలా టీడీపీ నాయకులు, యూనిట్ ఇన్‌చార్జిలు కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో పశువుల షెడ్ల నిర్మాణాలకు చేయూత ఇస్తోందన్నారు. ఇందు కోసం రాయితీని కల్పిస్తోందన్నారు. గ్రామల వారీగా నాయకులు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు గిరిజన రైతులు షెడ్ల నిర్మాణాలు చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణాలు చేపడతామని ముందుకు వస్తే నేరుగా తమకు సంప్రదిస్తే పశుసంవర్ధక శాఖ అధికారులతో మాట్లాడి షెడ్ల నిర్మాణాలు నిర్మించేలా కృషి చేస్తామని అయన తెలిపారు.

అపరిచితులకు ఆశ్రయం కల్పించవద్దు

ముంచంగిపుట్టు, ఆగస్టు 8 : అపరిచిత వ్యక్తులకు ఎవరూ ఆశ్రయం కల్పించరాదని ఎస్ఐ కె.రవీంద్ర కోరారు. ఎస్ఐ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో పలు గృహాలను తనిఖీ చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిపై ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రాత్రి వేళల్లో దొంగతనాలు జరుగుతున్నాయని, ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి 11 గంటలు దాటిన తరువాత అనవసరంగా ఎవరూ బయట తిరగరాదని, పనిలేకుండా తిరిగే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

గంజాయికి దూరంగా మెలగాలి : సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమేశ్

జి.మాడుగుల, ఆగస్టు 8 : గంజాయి సాగు, రవాణా, మధ్యవర్తులుగా వ్యవహరించడం నేరమని సీఐ రమేశ్ గిరిజనులకు సూచించారు. మండలంలోని అయన గురువారం బొయితిలి గ్రామంలో గిరిజనులకు గంజాయి నివారణపై అవగాహన కలిగించారు. గంజాయి సాగు బదులుగా ప్రత్యామ్నాయ పంటలే మేలని చెప్పారు. గ్రామాల్లో సమస్యలపై అడిగితెలుసుకున్నారు. అనంతరం బొయితిలి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎల్.అప్పలరాజు, మాజీ సర్పంచ్ రాంబాబు, హెచ్ఎం అప్పలకొండ పాల్గొన్నారు.

మాస్ ప్లాంటేషన్‌తో సత్ఫలితాలు : ఎంపీడీవో

కొయ్యూరు, ఆగస్టు 8 : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించి మండలంలో గల 33 పంచాయతీల పరిధి గ్రామాల్లో మాస్ ప్లాంటేషన్ (హార్టీకల్చర్) ప్రోగ్రాం విధిగా నిర్వహించాలని ఎంపీడీవో ఆదేశించారు. పాడేరు ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలో 50 ఎకరాలలో 35 వేల మొక్కలు నాటాలని నిశ్చయించారని, కాబట్టి మండలంలో గల ఉపాధి హామీ పథకం, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఈ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలన్నారు. అందుకు సంబంధించిన ఫొటోలు అఫీషియల్ వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఎంపీడీవో స్పష్టం చేశారు.

వ్యసనాలకు బానిస కావద్దు : ఎస్ఐ



పాల్గొన్న విద్యార్థులు

కొయ్యూరు, ఆగస్టు 8 : చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యార్థులు బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ సూచించారు. మండలంలోని కాకరపాడు గురుకుల జూనియర్ కళాశాల, పలు ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలను బుధ, గురువారాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, మద్యం, మాదక ద్రవ్యాలకు దూరంగా మెలగాలన్నారు. వీటివల్ల ఎలాంటి వారికైనా దుష్పరిణామాలే ఎదురవుతాయన్నారు. క్రమశిక్షణతో మెలగుతూ కేవలం చదువుపైనే దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంప, కొయ్యూరు పోలీసు స్టేషన్ల సిబ్బంది, ఆయా కళాశాలలు, పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.